# చిగురించిన గులాబి

ఆ సాయంత్రం వరండాలో ఈజీచైర్‌లో కూర్చొని విశ్వం అలోచిస్తున్నాడు అతను బ్యాంకు మేనేజరుగా ఉద్యోగం చేస్తున్నాడు. ఇంటిదగ్గర నుంచి పెళ్ళిచేసుకోమని వారానికో ఉత్తరం వస్తూ ఉంది. కాని అతని కిప్పుడిప్పుడే వివాహం చేసుకోవాలని లేదు. ఈరోజు ఉదయంకూడా అదే విషయంమీద తల్లిదండ్రుల దగ్గర నుంచి అందిన ఉత్తరం గురించి ప్రస్తుతం అలోచిస్తున్నాడు.

కొద్దిసేపటికి అలోచనలోంచి బయటపడి యధాలాపంగా తలెత్తి చూసాడు. ఎదురింటి డాబామీద చందమామలాంటి అమ్మాయి నిలబడి వీధిలోకి చూస్తోంది. ఆమె అందమైన ముఖం మీద చీకటి నీడలు తారాడుతూ గ్రహణంపట్టిన చంద్రుడిలా విచారకరంగా ఉంది. అభరణాలు ధరించకుండా సింపుల్‌గాఉన్న ఆమె ఎంతో అందంగా ఉంది. ఎంతసేపు చూసినా తనవితీరని అందమామెది.

హఠాత్తుగా తలపైకెత్తి విశ్వంవైపు చూసిన ఆమె బెదిరిన లేడిలా తడబడే అడుగులతో హడావుడిగా వెళ్లిపోయింది. అతని కంటికి ఆమె శాపవశాన భూలోకంలో అవతరించిన దేవతలా అనిపించింది. ఎదురింట్లో పదిహేను రోజులక్రితం ఒకకుటుంబం వచ్చి చేరింది. అంతకుముందు ఆఇంట్లోవున్న ఇంజనీరుకు హైదరాబాదు ట్రాన్సఫరయి వెళ్ళిపోయాడు. ఇంతవరకు కొత్తవాళ్ళ గురించి తెలుసుకోని విశ్వానికి ఈరోజు ఆ అమ్మాయి పేరేమిటో ఏం చేస్తుందో తెలుసుకోవాలనే కుతూహలం పుట్టింది.

పదిరోజులు గడిచిపోయాయి. మళ్ళీ ఆ అమ్మాయి విశ్వం కంటికి కనిపించలేదు. విశ్వం నిరంతర పరిశీలనమీదట ఆఇంటి

యజమాని స్థానిక కాలేజీలో లెక్చరరని అతనికి కాలేజీకివెళ్ళే ఒక కొడుకు, కూతురు ఉన్నారని, వాళ్ళేగాక ఇంకా ఇద్దరు చిన్నపిల్ల లున్నారని తెలుసుకొన్నాడు. కాని మెరుపుతీగలాంటి ఆఅమ్మాయి ఎవరో గుప్తంగానే ఉండిపోయింది.

పనిమనిషి రత్తాలుద్వారా ఈ విషయం తెలుసుకోవాలను కొన్నాడు. కారణం రత్తాలు వాళ్ళింట్లోకూడా పనిచేస్తుంది.

మరుసటిరోజు గది ఊడ్చి కూజాతో నీళ్ళుపెట్టి వెళ్ళ బోతున్న రత్తాలును పిలిచాడు.

"ఏంది సారూ" అంటూ వచ్చి ఎదురుగా నిలబడింది.

"ఎదురింట్లో ఒక అమ్మాయిని చూసాను రత్తాలూ. ఎందుకో ఆమెను చూస్తూంటే చాలా కష్టాల్లో ఉన్నట్లు కనబడుతోంది" అన్నాడు విశ్వం, ఎలా మాట్లాడితే రత్తాలు ఏవిధంగా అర్థం చేసు కుంటుందోనని భయపడుతూ.

రత్తాలు ముఖం క్షణాల్లో మారిపోయింది.

"తమరు చూసారు గదా సామే అయమ్మగోర్ని" అంది రత్తాలు బాధగా.

అవునని తలాడించాడు విశ్వం.

"ఏం చెప్పేది సామే అ వసంతమ్మ గోరి గురించి. అదంతా ఒక పెద్దకత. అబిడ్డను సూస్తే గుండె తరుక్కొని పోతుందనుకో. ఆమెకు మూడేళ్ళకిందట పెళ్ళిజేసిన్రంట. పెళ్ళయిన నెలరోజు లకే అయమ్మ మొగుడు స్కూటరు యాక్సిడెంటులో సచ్చిపోయా డంట" కళ్ళుతుడుచుకొంటూ అంది రత్తాలు.

"అయ్యో పాపం ఎంతపని జరిగింది" తనకు తెలియ కుండానే మాటలు వెలువడ్డాయి విశ్వం నోట్లోంచి.

"బాద అదికాదు సామే. ఇప్పుడు ఆమె అనుభవించేదే అసలైన బాద. మొగుడుపోయి ఆమె కష్టాల్లో ఆముంటే ఇంట్లో పరిస్థితి ఇంకా గోరంగాఉండాది. ఆమె గాజులు తొడుక్కోగూడ దంట. నగలు ఏసుకోకూడదంట. బొట్టుఎట్టుకోకూడదంట. పూలు ముడుసుకోగూడదంట. ఇంకా గోరమయిన సంగతొకటి సెప్తాను. ఆమె అందరూ నిద్రలేచి సానాలు సేసేవరకూ ఎవురికంటా పడ కూడదంట. ఏమన్యాయం" అంది రత్తాలు ఉద్వేగంగా.

విశ్వం గుండె గుబులుగా కొట్టుకొంది.

"ఏమయినా ఇట్టాంటియి మాకులాల్లో లేవు సామే. మొగుడు పోతే కొంతకాలం బాదపడతాం. తరువాత మారు మనువాడుతం. మా పసుపూ కుంకమలు ఏడికిబోవు. అళ్ళు పెద్దోళ్ళు. నాలాంటిది ఆళ్ళకేం సెప్పగలదు. నాకు ఇంకా శానా పనులుండయి నానొత్తా సామే" అంటూ వెళ్ళిపోయింది రత్తాలు

రత్తాలు వెళ్ళిపోయిన తరువాత వసంత గురించే చాలా సేపు ఆలోచిస్తూ ఉండిపోయాడు విశ్వం. ఎలాగయినా వారికుటుం బంతో పరిచయం చేసుకొని ఆమెను ఈ మూఢనమ్మకాల చెర నుంచి తప్పించాలనుకొన్నాడు. కాని చొరవ తీసుకోవడం ఎలా?

వసంత గురించి రోజుకొక విషయం చెప్పేది రత్తాలు. భర్త పోయిన తరువాత ఇప్పటికీ సినిమా చూసి ఎరుగదట వసంత. 'శంకరాభరణం' సినిమా ఎంతోబాగుందని ఇంట్లో అందరూ అను కొంటూంటే వెళ్తానని అన్నదట. అంతే. ఆమె నాన్నమ్మ ఇంట్లో పెద్ద గొడవ చేసిందట. అమ్మా, నాన్న ఆమెను చీవాట్లేసారట. అంతే. ఆరోజు నుంచి ఒక్కసినిమామీదేకాదు. మిగతా అన్ని వినోద కార్యక్రమాలమీద విరక్తి చెందిందట. ఇవన్నీ రత్తాలుతో చెప్పుకొని కన్నీరు కార్చిందట. ఇంట్లో వాళ్ళకంటే పనిమనిషి

రత్తాల్నే ఆత్మీయురాలుగా చెప్పుకొనేదట. ఇవన్నీ చెప్పి తనూ బాధపడేది రత్తాలు.

ఆచారాల ముసుగులో క్షణం క్షణం నరకమనుభవించే ఈ సమాజం సృష్టించిన అగ్రకులాల సంకుచిత మనస్తత్వాల కంటే సర్వమానవ సౌభ్రాత్రాన్ని కాంక్షించే ఏ ఆచారాలు లేని తక్కువ కులాలుగా భావించేవారి విశాలహృదయాలు ఎంతమిన్న అనుకొన్నాడు విశ్వం.

ఇంకోరోజు రత్తాలు ఆమె గాన మాధుర్యాన్ని గురించి ఎంతగానో పొగిడింది విశ్వం ముందు. ఒకరోజు రత్తాలు బావి దగ్గర బట్టలు ఉతికి తీగెమీద ఆరేస్తుందట. ఆ సమయంలో కొద్ది దూరంలోనున్న బాదంచెట్టు పక్కనుంచి చెవులకు ఇంపైన గొంతు వినిపించిందట. అవి మీరాబాయి కృష్ణుని గురించి పాడే భక్తి గీతాలట. రత్తాలు అక్కడెవరో టేపురికార్డరు పెట్టుకొని వింటున్నా రనుకొందట. తీరా వెళ్ళిచూస్తే అవలివైపు చెట్టునానుకొని రాగం తీస్తుందట వసంత. ఆమె కళ్ళలోంచి కన్నీరు బుగ్గలమీదుగా కారి గుండెలమీద పడుతున్నాయట.

రత్తాలును చూసి తత్తరపడి కళ్ళుతుడుచుకొందట ఆ సమయంలో రత్తాలు అనునయంమీద చెప్పిందట వసంత. తనకు భరతనాట్యంకూడా వచ్చని, అది చేయాలని ఎంతో ఉత్సాహమని, తన కోరిక నెరవేరడంలేదని బాధపడిందట.

ఇన్ని శుభలక్షణాలు గల వసంతను గురించి వింటూంటే విశ్వానికి లేనిపోని ఆవేశం వస్తోంది. ఎలాగయినా వాళ్ళను సంస్కరించి ఆమెకు విముక్తి కలిగించాలని ఉంది. కాని ఎలా వాళ్ళను పరిచయం చేసుకొని వాళ్ళు తనమాట వినేట్లు చేయాలి అనేది అతని బాధ.

ఒకరోజు అతనికి అతిచక్కని అవకాశ మొచ్చింది. ఆరోజు విశ్వం తన సీట్లో కూర్చొని పనిచేసుకొంటున్నాడు. ఇంతలో "నమస్కారంసార్" అంటూ ఒక వ్యక్తి ప్రవేశించాడు.

''నమస్కారం కూర్చోండి" అంటూ తలెత్తి చూసిన విశ్వం ఆ వ్యక్తిని చూసి ఆశర్యపోయాడు. అతను ఎదురింటి లెక్చరర్.

అతనుకూడా ఆశ్చర్యం ప్రకటిస్తూ "మీరు మా ఎదురింట్లో మేడమీద గదిలో ఉంటున్నారు కదూ" అన్నాడు.

ఇద్దరూ పరస్పర పరిచయాలు చేసుకొన్నారు. విశ్వం అటెండర్ని పంపి రెండు బ్రూకాఫీ తెప్పించి ఒకటి లెక్చరర్ నారాయణ మూర్తికి అఫర్ చేసాడు.

"ఏమిటి సార్ ఇలా వచ్చారు" అని అడిగాడు విశ్వం.

కొద్దిసేపు మౌనంగా ఉండి చెప్పాడు నారాయణమూర్తి. తన చిన్నకుమార్తె బి. ఎ. ఫైనల్‌లో ఉందని, అమెకు ఒక డాక్టరుతో సంబంధం కుదిరిందని, దానికిగాను యాభైవేలు కట్నం ఇవ్వాలని ఒప్పుకొన్నారట. ఇంట్లో అమ్మాయికి ఇవ్వాల్సిన బంగారం పోను, మిగతా గోల్డు తనఖాపెట్టుకొని లోను ఇవ్వమంటున్నాడు. అతను చెప్పిన బంగారాన్నిబట్టి ముప్పైవేలు వస్తుందని చెప్పాడు విశ్వం. యాభైవేలు ఇవ్వలేరా అన్నాడు జాలిగా. అలోచించి తరువాత చెబుతానన్నాడు విశ్వం. అతన్ని బాధపెట్టడం ఇష్టంలేక. మళ్ళీ వారంతరువాత వస్తానని చెప్పి వెళ్ళిపోయాడు నారాయణమూర్తి.

ఆ మరునటిరోజు ఉదయం స్నానంచేసి పక్కనున్న కాంటీన్‌లో టిఫిన్‌చేయడానికి వెళ్తుంటే అందుకోసమే వాకిట్లో నిలబడి ఉన్నట్లున్న లెక్చరర్ నారాయణమూర్తి "రండిసార్" అంటూ ఆహ్వానించాడు.

విశ్వం మారుమాట్లాడకుండా అతని వెంట లోపలికి వెళ్లాడు. నారాయణమూర్తి ఇంట్లో వాళ్ళందరినీ పరిచయం చేసాడు వసంతను తప్ప. వసంతకోసం గదంతా వెతికిన అతని కళ్ళు నిరాశ చేసుకున్నాయి. వద్దంటున్నా వినకుండా బలవంతంగా టిఫిన్ పెట్టారు. తిరిగి వస్తూంటే తన లోను సంగతి గుర్తుచేసాడు నారాయణమూర్తి. ఈరోజుల్లో కట్నాలేమిటండీ ఇచ్చేది అని అడుగుదామనుకున్నాడు విశ్వం. కాని అది వాళ్ళమీద ఎలాంటి ప్రభావాన్ని తెస్తుందోనని భయపడ్డాడు. వాళ్ళు ప్రిజుడిస్‌అయి ఇంకో బ్యాంకుద్వారా అప్పు తెచ్చుకోవచ్చు. అప్పుడు తనకు వీళ్ళ కుటుంబంతో కనెక్షన్ తెగిపోవచ్చు అనుకున్నాడు.

వసంత జీవితంలో వెలుగు నింపాలన్న దృఢనిశ్చయముండడంతో విశ్వం వాళ్ళతో ఏమీ వాదించదలచుకోలేదు. క్రమేణా పరిచయం పెంచుకుని వాళ్ళలో పరివర్తన తేవాలనుకొన్నాడు. అందుకే తన స్వంత పూచీమీదైనా మిగతా ఇరవైవేలు లోనుగా నారాయణమూర్తికి ఇవ్వాలనుకొన్నాడు.

రోజులు గడిచిపోతున్నాయి. ఇప్పుడు విశ్వం రోజూ రెండు పూటలా నారాయణమూర్తి ఇంటికి వెళ్ళివస్తున్నాడు వాళ్లింట్లో ఒక సభ్యుడిగా మెలుగుతున్నాడు. నాలుగురోజుల తరువాత నారాయణమూర్తి రెండవ కుమార్తెకు ముహూర్తాలు పెట్టుకున్నారు. ఆ మరుసటి రోజే నారాయణమూర్తి తన దగ్గరున్న బంగారాన్ని బాంకులోపెట్టి ముప్ఫైవేలు, పర్సనల్ సెక్యూరిటీకింద ఇంకోఇరవై వేలు తీసుకొన్నాడు. లోను ఇచ్చిన రోజునుంచీ విశ్వాన్ని నెత్తిన పెట్టుకోసాగారు వాళ్ళు.

ఒకరోజు పనిమనిషి రత్తాలు వచ్చి చెప్పిన మాటలు విని నిర్ఘాంతపోయాడు విశ్వం. నారాయణమూర్తి తన చిన్న కుమార్తె పెళ్ళి సందర్భంగా వివాహానికి రెండు రోజుల ముందుగా వసం

తను దూరంగా బంధువుల ఇంటికి పంపివేయాలనుకొన్నారట. పెళ్ళయిన నెలతరువాత తిరిగి తీసుకురావలని నిర్ణయించుకొన్నారట.

ఈవిషయం రత్తాలుతో చెబుతూ కళ్ళనీళ్ళుపెట్టుకుందట వసంత "చూడు రత్తాలూ! నా అదృష్టం బాగులేక ఇలా మోడునయ్యానే అనుకో, శుభమా అంటూ పెళ్ళిచేసుకొనే నా చెల్లెలికి ఆ శుభం కలగాలని కోరుకుంటానా? పెళ్ళిబట్టల్లో పచ్చగా కళకళలాడే నాచెల్లెల్ని చూసుకోవాలని నాకుండదా. పెళ్ళిపందిట్లోకి రాకపోయినా చాటుగనయినా చూసి ఆనందిస్తాను కదా" అంటూ మొరపెట్టుకుందట.

తరువాత మెల్లిగా "రత్తాలూ! నువ్వా బాంకు ఆఫీసరు గారింట్లోకూడా పనిచేస్తావుగా. అయన మాటంటే మా ఇంట్లో వాళ్ళకు అంత గురి. నువ్వెట్లాగయినా వారితో చెప్పి నేను వెళ్ళకుండా ఉండేట్లుచేయి. కాని నేను అయన్ని అభ్యర్థించినట్లు ఉండకూడదు. పెద్దదానివి, నాబాధ అర్థంచేసుకో" అంటూ ఏడ్చిందట.

వసంత తండ్రి నారాయణమూర్తి ఆలోచన, వసంత అభ్యర్థన విన్నమీదట విశ్వం గుండె కరిగిపోయింది. వసంతమీద ఇంతని చెప్పలేని జాలి, అభిమానం ఏర్పడ్డాయి.

ఆ సాయంత్రం బ్యాంకునుండి వస్తూ స్కూటరు నారాయణమూర్తి ఇంటిముందు ఆపాడు. అప్పటికే నారాయణమూర్తి కాలేజీ నుంచి ఇంటికివచ్చి ఉన్నాడు.

"రండి సార్" అంటూ లోపలికి ఆహ్వానించాడు.

"ఫరవాలేదండీ. మీతో కొన్ని విషయాలు మాట్లాడాలి, అలా పార్కువైపు వెడదాం వస్తారా" అన్నాడు విశ్వం అభ్యర్థిస్తున్నట్లు.

"నో అబ్జెక్షన్. అలాగే వస్తాను. అయితే కాఫీ తాగి వెళ్దాం" అన్నాడు నవ్వుతూ.

విశ్వం బయట స్కూటర్ లాక్‌చేసి లోపలికి వెళ్ళాడు. పది నిముషాల తరువాత ఇద్దరూ కాఫీ తాగి బయటకి వచ్చారు. విశ్వం స్కూటరు స్టార్టు చేసాడు. వెనుక కూర్చున్నాడు నారాయణమూర్తి. కొద్ది నిముషాల్లో వాళ్ళు పార్కు చేరుకొన్నారు.

జనసంచారం లేనిచోట ఇద్దరూ ఒకరికెదురుగా ఒకరు కూర్చొన్నారు. కొద్దిసేపు ఇద్దరూ లోకాభిరామాయణం మాట్లాడుకొన్నారు.

"ఏదో విషయం మాట్లాడాలన్నారు" అంటూ గుర్తుచేసాడు నారాయణమూర్తి.

విషయం ఎలా మొదలుపెట్టాలా అని ఆలోచిస్తున్న విశ్వం "సార్. మీరు నే నేదడిగినా దాచకుండా చెప్తారుగా" అన్నాడు.

"తప్పకుండా" అన్నాడు నారాయణమూర్తి.

"మీకు ఎంతమంది ఆడపిల్లలండీ"

ఈ ప్రశ్నకు నారాయణమూర్తి బెదరిపోయాడు.

"సారీసార్. మీకుటుంబ వ్యవహారాల్లో జోక్యం చేసుకొంటున్నాను గదూ"

"నో .. నో....మిమ్మల్ని నేను పరాయివాళ్ళుగా భావించడం లేదు" అన్నాడు నారాయణమూర్తి.

"అయితే చెప్పండి."

"నాకు ఇద్దరు ఆడపిల్లలండీ."

"ఇంకొకామె కనిపించదే. ఆమె ఎక్కడుంది"

"ఏం చెప్పేదిలెండి మాపెద్దమ్మాయి వసంత సంగతి. దాని దురదృష్టం తలచుకొంటూ మేము దుఃఖించని రోజులేదు" అంటూ వసంత సంగతి యావత్తూ చెప్పాడు.

''దురదృష్టం ఆమె భూతకాలాన్ని చిన్నాభిన్నంచేస్తే, మీరు ఆమె భవిష్యత్తును అంధకార బంధురం చేసారు. నాలుగు గోడల మధ్య ఆమెను కూర్చోబెట్టి 'నువ్వు విధవవు. నువ్వు విధవవు' అని వేలెత్తి చూపుతూ ఆమెను క్షణంక్షణం హింసిస్తున్నారు" తనలోని ఆవేశం బయటపెట్టాడు విశ్వం.

విశ్వంమాటలకు నారాయణమూర్తిదెబ్బతిన్నట్లు చూసాడు.

"అవును సార్. పెళ్ళయ్యాక భర్తద్వారా సంక్రమించేదితాళి మాత్రమే. భర్తపోతే తెంచేయాల్సింది తాళేగాని, మిగతావన్నీ త్యజించాల్నా?'' అంటూ తన మనసులోని విషయాలన్నీ బయట పెట్టేసాడు విశ్వం.

నారాయణమూర్తి బాగా రియలైజయ్యాడు విశ్వం చెప్పే ప్రతిపాయింటూ కరెక్టేనన్నట్లు తలఊపసాగాడు. అందుకే వసం తకు అందరితోబాటు సమాన స్వేచ్ఛను ఇవ్వమన్నాడు. అంద రిలా అలంకరించుకొని ఈలోకంలో తిరిగేట్లు చేయమన్నాడు.

నారాయణమూర్తి కళ్ళలో నీళ్ళుతిరిగాయి. "ఈ సమాజం ఒప్పుకోదండీ విశ్వంగారూ, విధవరాలుకేమిటి షోకులు అంటూ నన్ను వేధిస్తారండీ. తలెత్తుకోకుండా ముఖం వాచేట్లు చీవాట్లు పెడుతుందండీ లోకం" అన్నాడు,

"సో, సమాజం మిమ్మల్ని పోషిస్తుందన్నమాట. మీరు ఉద్యోగం చేసుకొని మిమ్మల్ని మీరు పోషించుకోవడం లేదన్న మాట. మీకుమార్తె తన ఖర్మకు గుండెపగిలి ఏడుస్తూంటే సమాజం సంతోషిస్తుందన్నమాట. మీకు కావలసింది సమాజం సంతోషించ డమే గాని మీకుమార్తె ఆనందం కాదన్నమాట. మీదెంత రాతి గుండె సార్, సమాజంకోసం రక్తం పంచుకుపుట్టిన బిడ్డ జీవితాన్ని కాలరాస్తారా'' ఈటెల్లాంటి ఆమాటలు నారాయణమూర్తి గుండెలో సూటిగా గుచ్చుకొన్నాయి. వినలేనట్లు చెవులు మూసుకొన్నాడు.

"సార్. మీరు చెప్పింది నిజమే, పచ్చగా కళకళలాడుతూ నాబిడ్డ నాకళ్ళముందు తిరగడమే నాకు కావలసింది ఈ బోడి సమాజం ఏమనుకొంటే నాకేం, అయితే నా కుమార్తె జీవితంలో మంచిరోజులొస్తాయంటారా" అన్నాడు ఆశగా.

"తప్పకుండా. అయితే మీరామెను అందరిపిల్లల్లా చూసుకోండి. అందరిలా స్వేచ్ఛగా తిరగనీయండి. అసలు వివాహమే కాలేదనుకోండి." అంటూ నారాయణమూర్తికి చాలాసేపు హితబోధ చేస్తాడు విశ్వం.

మరుసటిరోజు ఉదయం ఎనిమిదిగంటల ప్రాంతంలో విశ్వం బట్టలు వేసుకొని తయారై తల దువ్వుకొంటూంటే మంచినీళ్ల కూజాతో వచ్చింది రత్తాలు.

"సారూ. నువ్వు శానాగట్టోడివే" అంది కూజా గదిలో ఓమూల పెడుతూ.

రత్తాలు ఎప్పుడూ అంతచనువు తీసుకొనిఎరుగదు. అందుకే "ఏమయింది రత్తాలూ" అనడిగాడు విశ్వం.

"ఇంకా ఏంగావలేంది. అనారాయణమూర్తిగారింట్లో యుద్దం జరిగిపోనాది రాత్రంతా. ఉదయం వసంతమ్మగోరు సెరఇడిసిన సీతమ్మలా ఇల్లంతా తిరగతా ఉండాది. సెవులకు కమ్మలు ఎట్టుకొన్నది. కళ్లకు కాటుక, ముఖానబొట్టు. తలనిండా మల్లెపూలతో ఆయమ్మ బంగారుబొమ్మలా ఉందనుకో సారూ. అంతా తమరి సలవేనంట గదా" అంది.

అయితే రాత్రి పెద్దఘర్షణే జరిగి ఉంటుందనుకొన్నాడు విశ్వం కాకపోతే గత మూడు సంవత్సరాలుగాఉన్న కట్టుబట్టం ఒక్కరోజులో పేలిపోవడమంటే దానివెనుక నారాయణమూర్తి పట్టుదల ఎంతోఉండాలి అనుకున్నాడు. అతను తన మాటలకు విలువ నిచ్చినందుకు ఎంతో సంతోషించాడు విశ్వం.

"నీకు ఇవన్నీ ఎవరు చెప్పారు రత్తాలూ"

"ఆ యమ్మగారే అన్నీ చెప్పింది. ఆయమ్మ బతికున్నంత కాలం నిన్ను మర్చిపోదు సారూ" అంటూ వెళ్ళిపోయింది రత్తాలు.

వసంతకు తనపైఉన్న అభిమానానికి ఎంతోపొంగిపోయాడు. యథాప్రకారం నారాయణమూర్తి ఇంటికి వెళ్ళాడు. అయన చిరునవ్వుతో లోపలికి ఆహ్వానించాడు. పిల్లలూ, నారాయణ మూర్తి భార్య ఆనందంగానే ఉన్నారుగాని సనాతన భావాలుగల అతని ముసలి తల్లి మాత్రం విశ్వంవైపు కోపంగా చూస్తూ లోపలికి వెళ్ళిపోయింది

ఓ అయిదు నిముషాల తరువాత అందంగా అలంకరించుకొని ట్రేలో కాఫీకప్పు పట్టుకొని వచ్చింది వసంత. తలనిండా కొంగు కప్పుకొని ఉంది చిరునవ్వు ముఖంతో ఉన్న ఆమె ఇప్పుడు విశ్వం కంటికి సంపూర్ణ గృహిణిలా కనిపించింది.

"కాఫీ తీసుకోండి"

నిశ్శబ్దంగా ఉన్న సాయంసమయంలో వీణ పలికినట్లుంది ఆమె గొంతు.

ట్రే పట్టుకొని వణకుతున్న ఆమె చేతివ్రేళ్ళనే ఇష్టంగా చూస్తూ కప్పు అందుకొన్నాడు. తలెత్తి చూసిన విశ్వం అందరూ తననే గమనిస్తున్నట్లు అర్థం చేసుకొని సిగ్గుపడిపోయాడు. వసంత తన చెల్లెలి ప్రక్కనే సోఫాలో కూర్చొంది.

విశ్వం ఆసమయంలో చేసిన మహత్తరమైనకార్య మొకటుంది. వారంరోజులలో రవీంద్రభారతిలో జరగబోయే భరతనాట్య పోటీలకు ఆమె పార్టిసిపేట్ అయ్యేట్లుచేయడం. మొదట నారాయణమూర్తి భయపడ్డట్లు కనిపించాడు. విశ్వం చాలాసేపు ఆయనకు నచ్చజెప్పేసరికి ఒప్పుకొన్నాడు. అదేవిధంగా వసంతకూడా

మొదట కంగారుపడింది. కాని ఆమెకూ ధైర్యం చెప్పాడు విశ్వం. ఆ ఉత్సాహంతో కాబోలు ఆమె నిశ్శబ్దంగా కూర్చొనిఉన్నా నేల మీద అనిఉన్న ఆమె పాదాలు లయబద్ధంగా కదలసాగాయి.

ఎలాగయితేనేం అందరితోబాటు వసంతకూడా ఇప్పుడు విశ్వంతో ఫ్రీగా మువ్ అవుతోంది. రోజూ వెళ్ళివస్తున్నాడు విశ్వం. రత్తాలుద్వారా అతనికి తెలిసిందేమిటంటే రోజూ వసంత ఇంట్లోనే భరతనాట్యం ప్రాక్టీసు చేస్తోందని, ఈ మార్పుకు ఇంట్లోవాళ్ళ గుండెలు ఏరోజుకారోజు బెదురుతో కొట్టుకుంటున్నాయని. విశ్వం నవ్వుకొన్నాడు. ఇంకా జరగబోయే సంఘటనలు వారిని ఊపిరి కూడా తీసుకోనివ్వవని తలచాడు.

ఆరోజే భరతనాట్య ప్రదర్శన పోటీలు. విశ్వం తనఖర్చుతో టాక్సీ తెప్పించి తనే స్వయంగా ఉండి వసంతతోబాటు వసంత ఫామిలినీ రవీంద్రభారతికి తీసుకువెళ్ళాడు. ఆరోజు జరిగిన ప్రదర్శనలో వసంతకు ఫస్టు ప్రైజు వచ్చింది ఆమెలో ఇన్నాళ్ళు మరుగునపడిఉన్న కళ స్వేచ్ఛ దొరికేసరికి తన ప్రతిభను అద్భుతంగా చూపింది.

దాదాపు వారం రోజులు పడుకున్నా లేచినా నాట్యంలోని ఆమె భంగిమలు, ఆ దుస్తులలోని ఆమె భువనైక సుందర రూపం విశ్వం కళ్ళముందు కదలాడేది. ఆమె రూపం అతని హృదయంలో ముద్రించుకుపోయింది.

మరుసటిరోజు తన పుట్టినరోజని ఆహ్వానించింది వసంత. భర్తపోయిన ఈమూడేళ్ళ తరువాత ఇదే ఆమె మొదటి పుట్టిన రోజు జరుపుకోవడం. ఈ సంతోషసమయంలో ఆమెకో అద్భుతమైన కానుక ఇవ్వాలనుకొన్నాడు విశ్వం. కాని ఏది ఆలోచించినా అది ఆమెకు తగదనిపించేది. చివరకు ఎలాయితేనేం ఓ వజ్రపు

టుంగరం కొన్నాడు. ఆ రాత్రంతా ఆలోచించి తన మనసులోని ఆలోచనలను అక్షరరూపంలో పెట్టాడు.

"డియర్ వసంతా,

నేను నిన్నిలా పిలవడానికి అర్హుణ్నో కాదో నాకు తెలియదు. చొరవతీసుకొంటే నన్ను క్షమించు. నా మనసు నిండా నువ్వే నిండి ఉన్నావు. నా ప్రక్కన నీవుండాలని కోరుకొంటున్నాను. నా జీవితంలో వసంతం కురిపించమని వేడుకుంటున్నాను. పెళ్ళంటే ఒక నిర్లిప్తతను ఏర్పరచుకొన్న నేను, నిన్ను చూసిన తరువాత, నీ సద్గుణాలు విన్న తరువాత నిన్ను పెళ్ళిచేసుకోదలచాను. మీనాన్నతో ఈవిషయం అంటే మౌనంగా ఉన్నాడు. అంటే అర్ధంగీకారమేగా. నీ చెల్లెలిపెళ్ళితోబాటు మన పెళ్ళీ జరిగిపోవాలి. ఎక్కడ రసాభాస అవుతుందోనని భయపడకు. మొన్ననే మీచెల్లిలికి కాబోయే డాక్టరు వరుని కలుసుకొని అంతా చెప్పాను. అతను నన్నెంతగానో అభినందించాడు. ఆధునిక భావాలున్న అతని కుటుంబం దీనికి ఎంతో హర్షం వెలిబుచ్చింది. వాళ్ళు కట్నంకూడా మీనాన్న కోరికమీదే తీసుకుంటున్నారట. ఇక మా తల్లిదండ్రుల విషయంలో నీకే సందేహమూ అక్కరలేదు. ఇప్పటివరకు పెళ్ళిచేసుకోనంటున్న నేను పెళ్లికి ఒప్పుకొన్నందుకే ఎంతో సంతోషిస్తారు. ఇక నిన్ను చూస్తే నేను కాదన్నా నీచేత నాకే తాళి కట్టిస్తారు. ఆ నమ్మకం నాకుంది. శిలలా మోడువారిపోయిన నాజీవితాన్ని శిల్పంలా మలచి జీవం పోస్తావని ఆశిస్తున్నాను. నీ నిర్ణయం నాకు వ్యతిరేకమయినరోజు నేను నీకు కనిపించను. దూరంగా ట్రాన్సఫరు చేయించుకొని వెళ్ళిపోతాను. ఆ దురదృష్టం నాకు పట్టదని ఆశిస్తాను.

నీ

విశ్వం

మరుసటిరోజు సాయంత్రం నాలుగు గంటలకు బ్యాంకుకు పర్మిషను పడేసి నారాయణమూర్తి ఇంటికి వెళ్ళాడు విశ్వం. అక్కడకు వెళ్ళిన తరువాత అతని ఉత్సాహం నీరుకారిపోయింది అక్కడ పుట్టినరోజు వేడుక ఏమీలేదు హాల్లో కూర్చొనిఉన్న ఆమె చెల్లెలు విశ్వాన్ని చూసి 'అక్కయ్య లోపల ఉంది వెళ్ళండి' అంది. అక్కడ ఎవరూ అతన్ని పట్టించుకోలేదు. అదే మొదటిసారి వసంత గదికివెళ్ళడం కావడంతో శరీరం కొద్దిగా వణికింది.

తలస్నానంచేసి లూజుగా వేసుకొన్నజడతో, కొత్త దుస్తులతో తెల్లని మేఘపు తునకలా ఉంది వసంత. విశ్వాన్ని చూడగానే లేచి నిలబడింది

"విష్ యూ హాపీ బర్త్‌డే" అన్నాడు విశ్వం నవ్వుతూ.

వసంత ఉన్నట్లుండి అతని కెదురుగా మోకాళ్ళమీద కూర్చొని విశ్వం ఆశ్చర్యం నుంచి తేరుకొనే లోపలే వంగి తన శిరస్సును అతని పాదాలమీద ఉంచింది. అతనిశరీరం అభిమానంతో పులకించి పోయింది. మెల్లగా రెండు భుజాలుపట్టి లేపాడు. అదే మొదటిసారి విశ్వం స్త్రీని స్పృశించడం. ఆ అనుభూతి అనంతం.

వద్దంటున్నా వినక ఆమె వ్రేలికి విశ్వం తనే స్వయంగా రింగ్ తొడిగి తను వ్రాసిన ఉత్తరం ఆమె చేతిలో పెట్టాడు. బయట అలికిడి అయ్యేసరికి వెనుతిరిగిన అతను అప్పుడు గమనించాడు తన పాదాలదగ్గర అతికించిఉన్న కవరును. దానిమీద 'విశ్వంగారికి' అని వ్రాసి ఉంది. కవరు అందుకొని కళ్ళతోనే వసంతకు వీడ్కోలుచెప్పి హడావుడిగా గదికి తిరిగివచ్చాడు. అతని హడావుడికి కారణం ఆ ఉత్తరం. 'ఇది నాఆలోచనలను భస్మీపటలం చెయ్యొచ్చు, లేదా నానిర్ణయాలను సఫలీకృతం చెయ్యొచ్చు. ఏది ఏమయినా అందులో వసంత తన గుప్పెడు మనసును అక్షరాల రూపంలో తెరచిఉంటుంది' అనుకొన్నాడు.

గదిలో కూర్చొని వణకే చేతులతో కవరు చించాడు.

"సార్! విశ్వంగారూ!

....ఆ సంభోదనకు విశ్వం ఎంతగానో బాధపడ్డాడు. నిరుత్సాహంగా మిగతా ఉత్తరం చదువసాగాడు

"మీరు నా చీకటి జీవితంలో వెలుగు నింపారు. నిరాశతో కుంగిపోతున్న నాకు ఆశ అంటే ఏమిటో నేర్పారు. వాడి, త్వరలో ఎండి నేలరాలబోయే ఈ గులాబీని చిగురింపజేసారు. ఇక ఈ గులాబీ మొక్క మొగ్గతొడిగి పుష్పించాలంటే మీరు తోడుండాలి. ఈరోజు నాపుట్టిన తేదీ మాత్రమే. అసలైన పండుగవచ్చే సంవత్సరం మీ నీడన చేసుకొంటాను. నాది అత్యాశ అయితే ఎట్లీస్ట్ మీఇంట్లో దాసిగానయినా పెట్టుకోండి. రోజూ మిమ్మల్ని కంటి నిండుగా చూసుకొంటూ మీకు సేవలుచేస్తూ శేష జీవితాన్ని గడుపుతాను.

పై రెండింటిలో ఏ నిర్ణయం తీసుకొన్నా నేను మీకు కృతాజ్ఞురాల్ని. మరే నిర్ణయమూ నేను ఊహించను.

ఇట్లు,

మీ పూజారిణి,

వసంత

విశ్వం ఆనందం అంతాఇంతా కాదు. 'నువు దాసివి కాను వసంతా! నా ఆశవి' అనుకొంటూ ఆ ఉత్తరాన్ని ముద్దుపెట్టుకొన్నాడు.

★

తెలుగు విశ్వవిద్యాలయం
గ్రంథాలయము
4/256
నమోదు సంఖ్య
తేది 21.3.95